# డూప్లికేట్ కీ

గదికి తాళం కనబడలేదు. ఐనా ఆశ్చర్యపడలేదు. ఎందుకంటే ఆ గది తాళానికి వున్న డూప్లికేట్ కీ ని కాశీనాథ్‌కి కొన్ని రోజుల క్రితమే ఇచ్చిన గుర్తింది.

ఆటోరిక్షా ఫేర్ చెల్లించి గేటు పెట్టుకుని వెళ్ళి తలుపుమీద చప్పుడు చేశాను. లోపల కాశీనాథ్ నిద్రలో వున్నాడేమో – వెంటనే తెరుచుకోలేదు.

ఎందుకు?

"కాశీనాథ్"

జవాబుగా అతని గొంతు వినపళ్ళేదు. కాశీనాథ్ లోపల లేడా? ఇంకెవరయినా వున్నారా? వుంటే ఎవరు??

ఇలా అనుకుంటున్నప్పుడే తలుపులు తెరుచుకున్నాయి. చెదిరిన జుట్టుతో కాశీనాథ్ బయటకు వచ్చాడు.

"నిద్రపోతున్నావా"

అతను మాట్లాడలేదు. నేను లోపలకు వెళ్ళే ప్రయత్నంలో వున్నప్పుడు హటాత్తుగా ఒకామె ఆ గదిలోనించి బయటకు వచ్చింది కంగారుపడుతూ.

షాక్ !

నాకు తెలుసు ఆమె, నేనూ ఆమెకు తెలుసు.

ఈ షాక్ నించి తేరుకుంటూ కాశీనాథ్‌కోసం చూస్తే అప్పటికే అతను రోడ్డుమీద వున్నాడు. గబగబా వెళ్ళి అతడ్ని కలుసుకుంది ఆమె.

ఆ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒంట్లో బావుందక గదికి తిరిగి వచ్చిన నాకు ఇలాంటి సంఘటన ఎదురవుతుందని ఎలా అనుకోగలను?

కొంచెం సేపట్లోనే వాళ్ళిద్దరూ కనబడకుండా వెళ్ళిపోయారు.

లోపలకు వెళ్ళాను.

మంచంమీద పరుపు – దుప్పటి చెదిరిపోయి వున్నాయి.

కాశీనాథ్ ఇంతటి బ్రూట్ అనుకోలేదు. జరిగినదానికి కనీసం సారీ కూడా చెప్పకుండా నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

కుర్చీలో కూర్చున్నాను.

గదంతా సిగరెట్టు ముక్కలతో నిండి వుంది.

పొరపాటు చేశానేమో? కాశీనాథ్‌కి నా గది డూప్లికేట్ కీ ఇవ్వకుండా వుంటే బావుండేది.

ఇప్పుడనుకుని యేమిటి ప్రయోజనం?

చాలా పెద్ద యెత్తు చేశాడు.

విజయం సాధించాడు.

ఆ గదిని నాకు అద్దెకిచ్చిన ఇంటివాళ్ళకు ఈ విషయం తెలిస్తే ఎలా వుంటుంది? అదృష్టం - వాళ్ళు వూళ్ళో లేరు.

మా ఇద్దరి మధ్య వున్న స్నేహాన్ని కాశీనాథ్ బాగా వుపయోగించుకున్నాడు.

ఎన్ని నీతులు చెప్పేవాడు?

చివరికి ఇలాగ చేశాడు. ఇద్దరు పిల్లలున్న ఆడదాన్ని నా గదికి తీసుకువచ్చి ఇలాగ చేశాడు.

ఆమె ఎవరో కాదు. మాకు బాగా స్నేహితుడైన రమాపతి భార్య. ఆమె పేరు సుజాత. కొన్నాళ్ళు వాళ్ళ ఇంటి పక్క పోర్షన్‌లోనే కాశీనాథ్ అద్దెకు వున్నాడు.

ఆ సుజాతకైన బుద్ధి వుంటే బావుండేది.

ప్రేమగా చూసుకునే మొగుడూ - ఇద్దరి పిల్లలూ వుండి ఈ కాశీనాథ్ వలలో ఎట్లా చిక్కుకున్నది?

మంచంమీద పరువు - దుప్పటి తీసేసి పడుకున్నాను. కొంచెంసేపటి క్రితమే ఆ ఇద్దరూ ఈ మంచాన్ని బాగా వుపయోగించుకుని వుంటారు. అన్ని సౌకర్యాలూ వున్నాయనే కాశీనాథ్ ఈ గదికోసం గొప్ప ప్లాన్ చేశాడు.

ఇప్పుడు తెలుస్తోంట - కాశీనాథ్ ఒక పథకం ప్రకారం నా దగ్గర గది డూప్లికేట్ కీ కొట్టేశాడు.

కొన్ని రోజుల క్రితం నించీ అతను నా గదికి చాలాసార్లు వచ్చాడనీ, నేను లేనని చెప్పటం మొదలుపెట్టాడు. చివరకు ఒకరోజు 'ఇంకో కీ వుంటే ఇవ్వరాదా.... నువ్వొచ్చేవరకూ గదిలో కూర్చుంటాను' - అన్నాడు. ఏమాత్రం ఆలోచించకుండా డూప్లికేట్ కీ అతనికిచ్చాను.

ఇప్పుడిలా చేశాడు.

ఆ క్షణంలో రమాపతిని గుర్తుచేసుకుంటే బాధ కలిగింది. ఆయనతో స్నేహం

నటిస్తూనే ఆయన భార్యను లొంగదీసుకుని అన్యాయం చేస్తున్నాడు.

ఈ నిజం రమాపతికి తెలిస్తే ఏమవుతుంది? ఎంత కుమిలిపోతాడు? రమాపతికి కాశీనాథ్ అంటే ఎంతో నమ్మకం వుంది.

కాశీనాథ్ వాళ్ళ పక్క పోర్షన్‌లో వున్నప్పుడు ఎన్నోసార్లు అతన్ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించేవాడు. ఎంతో అభిమానం కనబరచేవాడు.

ఇందులో నాకు ఆశ్చర్యం కలిగించిన అంశం ఒక్కటే వున్నది – అప్పుడప్పుడే కాశీనాథ్‌తో వాళ్ళ ఇంట్లోకి వెళ్ళేవాడిని. అప్పుడు గమనిస్తే రమాపతి భార్య సుజాత కాశీనాథ్ పట్ల కొంచెం కూడా ఇంట్రస్టు వున్నట్టు కనబడేది కాదు. చాలా మామూలుగా వుండేది.

ఆమె చాలా వుత్తమురాలనీ, అటువంటి భార్య దొరకటం రమాపతి అదృష్టమనీ అనుకునేవాడు.

కాని ఇప్పుడు అనిపిస్తోంది అంతకంటే దురదృష్టం ఇంకోటి లేదని....

చాలాసేపు ఎదురుచూశాను కాశీనాథ్‌కోసం. ఆమెను ఆటో ఎక్కించి నాకు క్షమాపణ చెప్పటానికి తిరిగి వస్తాడని.

కాని రాలేదు.

అతనెందుకు వస్తాడు?

ఐనా – కాశీనాథ్ ఎలా ఇంతటి ధైర్యానికి సిద్ధపడ్డాడు? ఈ విషయం నాకు తెలియదని అనుకున్నాడా? తెలిసినా నేనేమీ అనుకోనని అనుకున్నాడా?

ఏది యేమైనా – ఇంకెప్పుడూ ఎవరికీ నా గది డూప్లికేట్ కీ ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాను.

❖ ❖ ❖

పదిహేను రోజులు గడిచినా కాశీనాథ్ ఒక్కసారి కూడా నన్ను కలవలేదు. మా ఇద్దరిదీ ఒక ఆఫీస్ కాదు. అతను కొన్నాళ్ళుగా వాళ్ళ బంధువుల ఇంట్లోనే ఓ గదిలో ఉంటున్నాడు.

అతన్ని కలుసుకునే ప్రయత్నాన్ని నేను కూడా చెయ్యలేదు. అలాంటి మనుషులతో స్నేహాన్ని కలిగివుండాలనే వుద్దేశం కూడా నాకు లేదు.

ఒకరోజు రమాపతితో అవసరం వుండి సాయంత్రం ఆఫీసు నుంచి వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

అతను ఇంట్లో లేడు.

సుజాత ఒంటరిగా వుంది.

నన్ను చూడగానే కంగారుపడింది. ఐనా సర్దుకుని "రండి కూర్చోండి" అన్నది కొంచెం నవ్వూ తెచ్చిపెట్టుకుంటూ.

"మళ్ళీ వస్తాను"

"ప్లీజ్.... ఐదు నిమిషాలు కూర్చోండి మీతో మాట్లాడాలి" అన్నది.

ముందుగదిలో వున్న కుర్చీలో కూర్చున్నాను. సుజాత ఏం మాట్లాడుతుందో నాకు తెలుసు. ఐనా వినాలనే ఆసక్తితో కూర్చున్నాను.

లోపలకు వెళ్ళి కొంచెంసేపట్లో కాఫీ తీసుకువచ్చింది సుజాత.

"ఇప్పుడెందుకూ?" అన్నాను.

"తీసుకోండి" అన్నది.

కాఫీ తాగుతున్నప్పుడు మొదలుపెట్టింది. ఆమె

"తల్చుకుంటే గుండె తరుక్కుపోతోంది. పెళ్ళయినదాన్ని. ఆయన నన్ను ఎంతో ప్రేమగా - అపురూపంగా చూసుకుంటున్నారు. ఇద్దరు పిల్లలు కూడా వున్నారు"

ఆమె గొంతు చిన్నదయ్యింది ఇలా చెబుతున్నప్పుడు -

"కాని ఏం చెయ్యను? మీ స్నేహితుడు ఆ కాశీనాథ్ నన్ను ఏదో ఆకర్షణతో నన్ను తనవైపుకు లాగాడు. తెలిసే తప్పటడుగు వేశాను. అసలు ఈ తప్పంతా ఆయనదే. స్నేహితుడని నమ్మి ఈ పక్క పోర్షన్‌లోకి అతన్ని తీసుకురాకుండా వుంటే బావుండేది. ఈ నిజం ఆయనకు తెలిస్తే తట్టుకోగలరా? చెప్పండి?"

కాఫీకప్పు కింద పెట్టాడు.

ఆ నిముషంలో నాకూ బాధ కలిగింది.

ఇడియట్! ఈ తప్పంతా కాశీనాథ్‌దే. సాఫీగా సంసారం చేసుకునే ఓ ఆడదాన్ని మాటలతో లొంగదీసుకుని నీతి తప్పించాడు. ఇటువంటివాళ్ళను కాళు ) - చేతులు కట్టి వేగంగా వస్తున్న రైలు కింద పడెయ్యాలి.

ఉన్నట్టుండి "దయచేసి మీరు నాకో సాయం చెయ్యాలి" అన్నది సుజాత నా కళ్ళలోకి చూస్తూ.

ఈ రహస్యం గురించి ఎవ్వరికీ - ముఖ్యంగా రమాపతికి చెప్పవద్దని ప్రామిస్ చెయ్యమంటుదనుకుంటాను.

అవును అంతే.

"ఏం చెయ్యమంటారు? చెప్పండి" అన్నాను.

"మేమిద్దరం మాట్లాడుకోవలసిన విషయాలు ఇంకా కొన్ని మిగిలి వున్నాయి. ఎక్కడా కులుసుకుని స్థిమితంగా మాట్లాడుకోటానికి వీలుకుదరటం లేదు. ఒక్కసారి మీ గది డూప్లికేట్ కీ ఇస్తారా?" అన్నది ఆశగా సుజాత.

ఈసారి నాకు నిజంగానే మతిపోయింది. ❖

*పల్లకి వారపత్రిక, 3-3-1993*